సాహిత్యంలో 'అరుణ' కిరణం!

భీంసరికి చెందిన ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ ప్రాథమిక స్థాయి విద్యార్థులను బాలకవులు, సాహిత్యవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. 8లో▸





బాక్సింగ్ చాంపియన్లుగా నిలవాలి

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు మంచిర్యాలలో శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డు



వివరాలు పరిశీలిస్తున్న డీఎస్‌వో

కైలాస్‌నగర్: అర్హులైన ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డు అందిస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి మహ్మద్ వాజీద్ అలీ అన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం అందిన దరఖాస్తులకు సంబంధించిన సర్వేను మావల మండల పరిధిలోని షాద్‌నగర్, కైలాస్‌నగర్ కాలనీల్లో రెవెన్యూ సిబ్బంది శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సర్వే తీరును పరిశీలించారు. పలువురు దరఖాస్తుదారుల కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా తప్పుడు సమాచారం ఇస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట నాయబ్ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్, సీనియర్ అసిస్టెంట్ వినోద్‌రావు, రికార్డు అసిస్టెంట్ వెంకన్న తదితరులున్నారు.

అందుబాటులో 15 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

కైలాస్‌నగర్: జిల్లాలో ఇప్పటి వరకు 15 లక్షల పత్తి విత్తన పాకెట్లు వివిధ మండలాల్లోని డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. అలాగే 55వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అధీకృత డీలర్ నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని, అలాగే తప్పనిసరిగా రశీదు పొందాలని పేర్కొన్నారు. రశీదు, విత్తన ప్యాకెట్ కవర్‌ను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించినట్లైతే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ



మాట్లాడుతున్న కిరణ్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఉర్దూ, గణితం, సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్లకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కోర్సు కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఇందులో సబ్జెక్టుల నిపుణులు మహ్మద్ జావేద్ హిలాల్, ముజాహిద్ అహ్మద్, ముకామిక్ జాని, ఫరీదా తస్లీమ్, అజీజ్ నవీద్, రాష్ట్ర పరిశీలకుడు అయూబ్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రంలో విద్యార్థిపై దాడి

ఆదిలాబాద్‌టౌన్: పరీక్షలకు సంబంధించి చూచిరాతల్లో తలెత్తిన వివాదం ఓ విద్యార్థిపై మరో విద్యార్థి దాడికి పాల్పడేలా చేసింది. ఈ ఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రస్తుతం డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలోని రూం నంబర్ 17లో షేక్ నావిద్ అనే విద్యార్థి మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇన్విజిలేటర్ గమనించి విద్యార్థి నుంచి చీటీలు లాక్కున్నాడు. దీంతో ఆ విద్యార్థి తనతో పాటు అదే తరగతి గదిలో పరీక్ష రాస్తున్న అనిరుధ్ కూడా కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో తనపేరు ఎందుకు చెప్పావని నావిద్‌తో పేర్కొనగా ముఖంపై దాడి చేయడంతో అనిరుధ్ కంటి అద్దాలు పగిలిపోగా, కంటికి తీవ్రగాయాలయ్యాయి. 13 కుట్లు పడ్డాయి. మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారు. ప్రిన్సిపాల్ అతీక్‌బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నావిద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

ప్చ్..



ఇక్కడ కనిపిస్తున్న రైతు నాగుల అరుణ్. భోరజ్ మండలం పెందల్వాద గ్రామం. రెండెకరాల్లో జొన్న సాగు చేశాడు. 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నాలుగు రోజుల క్రితం విక్రయించేందుకు పిప్పర్‌వాద కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చాడు. వాతావరణం సరిగా లేదని ఒక సారి, సిబ్బంది లేరని, ఇతర కారణాలతో వాటిని కొనుగోలు చేయలేదు. ఇటు అకాల వర్షాలు కురుస్తుండటంతో కింద నుంచి నీరు వచ్చి కుప్ప తడిసిపోయింది. జొన్నకు మొలకలొచ్చాయి. తడిసిన పంటను త్వరగా కొనుగోలు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు రైతు.



ఈ రైతు పేరు మారిశెట్టి వెంకన్న. జైనథ్ మండలంలోని కూర గ్రామం. ఎకరంలో జొన్న సాగు చేయగా 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. జొన్నలను జైనథ్ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. తన కుప్పకు సీరియల్ నంబర్ ఇచ్చినప్పటికీ ఆ నంబర్ ఆధారంగా కొనుగోలు చేయడం లేదని ఈయన ఆరోపిస్తున్నాడు. ఐదు రోజులు గడుస్తున్నా తన పంటను కొనుగోలు చేయడం లేదని వాపోతున్నాడు.

- అకాల వర్షం.. ఆగమాగం
- జొన్నలు తడిసి.. మొలకెత్తినయ్!
- కొనుగోలు కేంద్రాల్లో రైతుల కష్టాలు
- వాటిని కొనుగోలు చేయాలని వేడుకోలు



భోరజ్ మండలం పిప్పర్‌వాద కొనుగోలు కేంద్రంలో ఓ బస్తాలో మొలకెత్తిన జొన్నలు

జొన్న పంట వివరాలు

యాసంగిలో సాగైన విస్తీర్ణం	: 1.10లక్షల ఎకరాలు
దిగుబడి అంచనా	: 15లక్షల క్వింటాళ్లు
ఇప్పటి వరకు కొన్నది	: 4.65లక్షల క్వింటాళ్లు
పంట అమ్మిన రైతులు	: 13వేలకు పైగా
ప్రభుత్వ మద్దతు ధర	: రూ.3,371(క్వింటాల్)

సాక్షి, ఆదిలాబాద్: జొన్న రైతుకు కష్టమొచ్చింది. ఈ యాసంగిలో మంచి దిగుబడి రావడంతో సంబురపడ్డా అది ఎక్కువకాలం నిలవలేదు. చేతికొచ్చిన పంటను మార్కెట్‌లో అమ్మేందుకు తీసుకువచ్చిన తరుణంలో అకాల వర్షంతో తన కష్టం నీరుగారిపోతుంది. పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే ఇక్కడ వాతావరణం అనుకూలించడం లేదని, సిబ్బంది లేరని, ఇప్పటికే కొనుగోలు చేసిన పంట నిల్వలు పేరుకుపోయాయని ఇలా వివిధ కారణాలతో రైతులను రోజుల తరబడి నిరీక్షించేలా చేస్తున్నారు. అకాల వర్షాల కారణంగా బ్యాగుల్లో ఉన్న జొన్నలు, కుప్పల దరికి వర్షపునీరు చేరడంతో జొన్నలు మొలకెత్తుతున్నాయి. రైతులు లబోదిబోమనాల్సిన పరిస్థితి. మరోవైపు నిర్వాహకులు తడువని పంటను మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మొలకెత్తిన వాటిని పక్కకు తప్పిస్తున్నారు. దీంతో రైతు నష్టపోవాల్సిన పరిస్థితి. అంతే కాకుండా కేంద్రాల్లో మొలకెత్తిన జొన్నలను మరో బ్యాగులకు మార్చేందుకు రైతుల నుంచి బస్తాకు రూ.5 వసూలు చేస్తున్నారు. హమాలీ చార్జీలు కూడా వసూలు చేస్తుండటంతో రైతుకు ఇటు పంట నష్టం అటు నిలువు దోపిడీకి గురి కావాల్సి వస్తోంది.

వర్షం.. ఎండ.. వర్షం

బజార్‌హత్నూర్: మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షంతో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో జొన్నలు తడిసిపోయాయి. శనివారం మధ్యాహ్నం కొద్ది సేపు ఎండ రావడంతో వాటిని రైతులు ఇలా ఆరబెడుతూ కనిపించారు. మళ్లీ సాయంత్రం వర్షం కురువడంతో టార్పాలిన్లు కప్పారు. అయితే తేమ కారణంగా జొన్నలకు మొలకలు వస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తడిసిన జొన్నలను ఆరబెట్టిన రైతులు

సగం కంటే తక్కువే...

జిల్లాలో జొన్న పంట కొనుగోలు గత నెల 22న మొదలైంది. మార్క్‌ఫెడ్ ద్వారా మొత్తం 16 కేంద్రాల్లో పీఏసీఎస్ సిబ్బంది కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు అంచనా దిగుబడిలో సగం కంటే తక్కువే కొనుగోళ్లు జరిగాయి. ఇదిలా ఉంటే ఈ నెల చివరిలోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారుల ఆదేశాలున్నాయి. కేంద్రాల్లో మాత్రం వివిధ కారణాలతో పంటను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు గోస పడుతున్నారు. తమ కష్టాన్ని ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. కొన్ని కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో పక్క ఇప్పటికే కొనుగోలు చేసిన పంటను తరలించడంలో రవాణా సదుపాయం సరిగా లేవనే ఆరోపణలు వస్తున్నాయి. ఇక మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి జొన్నలను అక్రమంగా తీసుకువచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే విమర్శలు సైతం లేకపోలేదు. ఇటీవల పలు ఘటనలు చోటు చేసుకోవడం గమనార్హం. దీంతో మన రైతుల నుంచి కనీస మద్దతు ధరకు సకాలంలో కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడుతున్నాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వర్షాల కారణంగానే ఆలస్యం

అకాల వర్షాలు కురుస్తుండటంతో పంటను సకాలంలో కొనుగోలు చేయలేకపోతున్నాం. కేంద్రాల నుంచి నిల్వలను తరలించేందుకు ఎప్పటికప్పుడు లారీలను అందుబాటులో ఉంచుతున్నాం. 1500 లారీలు ఇందుకోసం ఉన్నాయి.

– ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ డీఎం, ఆదిలాబాద్

పాత స్టాక్.. కొత్త రేటు!

వినేశ్ (పేరు మార్చాం) శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌక్ సమీపంలో ఉన్న ఓ వైన్స్ నుంచి ప్రీమియం లిక్కర్ హాఫ్ కొనుగోలు చేశాడు. ఆ బాటిల్‌పై ఎంఆర్‌పీ రూ.660 ఉంది. అయితే వైన్స్‌లో రూ.680 తీసుకున్నారు. రూ.20 ఎక్కువగా ఎందుకని అతడు ప్రశ్నించగా, ప్రభుత్వం రేట్లు పెంచిందని దుకాణదారుడి నుంచి సమాధానం వచ్చింది. పెంచితే ఎంఆర్‌పీ ఉండాలి కదా అని అతను తిరిగి ప్రశ్నించాడు. కొత్త స్టాక్‌పై ఆ రేటు వస్తుందని.. ఇది పాత స్టాక్ అని వైన్స్‌లోని వ్యక్తి నుంచి తిరిగి సమాధానం వచ్చింది. చేసేది లేక అతడి అక్కడి నుంచి నిట్టూర్పుతో వెళ్లాడు.

- జిల్లాలో మద్యం వ్యాపారుల తీరిది
- ధరల పెంపు ముందే పసిగట్టి భారీగా సరుకు కొనుగోలు
- నిల్వ లిక్కర్ ధర పెంచి విక్రయాలు
- మందుబాబుల జేబులకు చిల్లు
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ



సాక్షి,ఆదిలాబాద్: తెలంగాణ ప్రభుత్వం గడిచిన సోమవారం రాష్ట్రంలో లిక్కర్ ధరలు పెంచింది. అయితే గత ఫిబ్రవరిలో బీర్ల ధరలను 15 శాతం పెంచిన విషయం తెలిసిందే. తాజాగా ఫుల్‌బాటిల్‌పై రూ.40, హాఫ్‌పై రూ.20, క్వార్టర్ పై రూ.10 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. అయితే పాత స్టాక్‌పై కొత్త రేటును వైన్స్ యజమానులు వసూలు చేస్తున్నారు. నిల్వ ఉన్న స్టాక్‌ను అడ్డగోలుగా పెంచి మందుబాబుల జేబు లకు చిల్లు పెడుతున్నారు. జిల్లా కేంద్రంలోని అన్ని వైన్స్‌లలో ఇది బాహాటంగా సాగుతుంది. కొంత మంది బాటిళ్లపై ఉన్న ఎంఆర్‌పీ విషయంలో ప్రశ్నిస్తే.. ప్రభుత్వం పెంచినప్పటి నుంచి ఆ ధరలు ఆటోమెటిక్‌గా అమల్లోకి వచ్చాయని చెబుతున్నారు. కొన్నిచోట్ల మద్యంప్రియులు వారితో వాగ్వాదానికి దిగుతున్నారు. కొంత మంది పోనిలే అని అక్కడినుంచి వెళ్లిపోతున్నారు.

ముందే సమాచారం లీక్.. స్టాక్ ఫుల్‌గా కొనుగోలు

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19 నుంచి మద్యం ధరలు పెంచేసింది. అయితే ఈ సమాచారం మద్యం వ్యాపారులకు ముందుగానే లీక్ అయినట్లు ప్రచారం ఉంది. దీంతో వారు అన్నిరకాల లిక్కర్ బాటిళ్లకు సంబంధించి స్టాక్ ఫుల్‌గా కొనుగోలు చేసి వైన్స్‌లలో నిల్వ ఉంచారు. జిల్లా కేంద్రంలోని ప్రతీ వైన్స్‌లలో ఇప్పుడు నెలకు పైగా సరిపడా సరుకు నిల్వ ఉన్నట్లుగా తెలుస్తోంది. దీంతో పాత లిక్కర్ బాటిళ్లను కొత్త ధరతో అమ్మడం ద్వారా మద్యం వ్యాపారులు దండిగా మందుబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

ప్రేక్షక పాత్రలో ఎక్సైజ్‌శాఖ..

సాధారణంగా మద్యం ధరలు ప్రభుత్వం పెంచిన తర్వాత ఎక్సైజ్ శాఖ అధికారులు పాత స్టాక్ విషయంలో నిర్ణయాత్మక పాత్ర వహించాలి. ప్రధానంగా ప్రతీ వైన్స్‌లో ఎంత మేరకు పాత స్టాక్ ఉందనేది పరిశీలన చేయాలి. ఆ లిక్కర్‌ను పాత ధరలోనే విక్రయించాలి. ఇక కొత్త స్టాక్ మార్కెట్లోకి వచ్చిన తర్వాత ఆ ఎంఆర్‌పీకి అనుగుణంగా విక్రయాలు జరిగేలా చూడాలి. అయితే వైన్స్‌లలో పాత స్టాక్‌ను బాహాటంగా కొత్త ధరలతో అమ్ముతున్నప్పటికీ ఆశాఖ అధికారులు 'మామూలు'గా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.

మాకెలాంటి ఫిర్యాదు రాలేదు

వైన్స్‌లలో పాత స్టాక్‌ను కొత్త ధరలతో అమ్ముతున్నారనే విషయంపై మాకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. ప్రభుత్వం నుంచి కూడా ఈ విషయంలో తనిఖీలు చేయాలని కూడా ఆదేశాలు రాలేదు. అయినప్పటికీ ఈ విషయంలో పరిశీలన చేస్తాం.

– హిమశ్రీ, జిల్లా ఎక్సైజ్ అధికారి

నేడు 'జీపీవో' రాత పరీక్ష

- హాజరుకానున్న 82 మంది పూర్వ వీఆర్‌వో, వీఆర్‌ఏలు

కైలాస్‌నగర్: గత బీఆర్‌ఎస్ సర్కారు రద్దు చేసిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగాంగా గ్రామ పాలన అధికారి (జీపీవో)పోస్టుల నియామకానికి ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ పోస్టుల కోసం 83 మంది పూర్వ వీఆర్‌వో, వీఆర్‌ఏలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో 55మంది వీఆర్‌వోలు, 28 మంది వీఆర్‌ఏలు ఉన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగనుంది. అభ్యర్థులు 10 గంటల లోపే కేంద్రానికి చేరుకోవాలని, హాల్‌టికెట్‌తో పాటు ఎంప్లాయ్ ఐడీ, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. అభ్యర్థులను నిర్ధారించేందుకు గాను కేంద్రం వద్ద ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులను ఐడెంటిఫికేషన్ అధికారులుగా నియమించారు. కలెక్టర్ రాజర్షి షా నేతృత్వంలో నిర్వహించనున్న పరీక్షకు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి నోడల్ అధికారిగా, ఆర్డీవో వినోద్ కుమార్ లైజన్ అధికారిగా వ్యవహరించనున్నారు. కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్షను ప్రశాంతంగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

రేపు సర్టిఫికెట్ల పరిశీలన ..

అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 26న చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే ఈ ప్రక్రియకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

అటవీ అనుమతులకు ప్రత్యేక చర్యలు

- వీసీలో రాష్ట్ర మంత్రులు సీతక్క, సురేఖ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనుల్లో అటవీశాఖ అనుమతులకు ఏర్పడిన ఇబ్బందులు పరిష్కరిస్తామని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులతో శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అటవీ అనుమతులు రాకపోవడంతో అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం అవుతుందని ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు , కోవ లక్ష్మి, పాల్వాయి హరీష్, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండే విఠల్ మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను త్వరలోనే పరిష్కరించి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని వారు భరోసానిచ్చారు. ఆయా శాఖలు సమన్వయంతో పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. కాగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాజర్షి షా ఈ వీసీలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ నుంచి ఇంద్రవెల్లి రోడ్డు, ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ నుంచి సిరికొండ మండలం వాయిపేట్ రోడ్డుకు సంబంధించిన అనుమతులు పెండింగ్‌లో ఉన్నట్లుగా మంత్రులకు వివరించారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజర్షి షా

చదువుతోనే గిరిజనుల అభివృద్ధి

- ఎస్పీ అఖిల్ మహాజన్



కుండి గ్రామంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

నార్నూర్: చదువుతోనే గిరి గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నా రు. గాదిగూడ మండలంలోని కుండి, షేకుగూడ, పిప్రి (జి), పూనగూడ గ్రామాల్లో పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలని సూచించారు. త్వరలోనే గాదిగూడలో అగ్నివీర్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ శిబిరం ప్రారంభిస్తామని తెలిపారు. యువత సన్మార్గంలో పయనించాలని సూచించారు. గంజాయి సాగు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా సంక్షేమ పథకాలను రద్దు చేస్తామన్నారు. ప్రతీ గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను కేటాయించామన్నారు. ఎలాంటి సమస్యలున్నా డయల్ 100 లేదా విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. అనంతరం నాలుగు గ్రామాల్లోని యువతకు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ కిట్లను అందజేశారు. క్రీడారంగంలో రాణించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో నార్నూర్ సీఐ రహీంపాషా, గాదిగూడ ఎస్సై జీవన్ రెడ్డి, ఆదివాసీ నాయకుడు మెస్రం శేఖర్, మాజీ వైస్ ఎంపీపీ యోగేష్, గ్రామ పటేళ్లు లక్ష్మణ్, పైకు, జంగు, రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భూభారతి భరోసానిచ్చేనా..?

- పైలట్ మండలంలో భారీగా దరఖాస్తులు
- ప్రారంభమైన క్షేత్రస్థాయి విచారణ
- ఆరు ప్రత్యేక బృందాల ఏర్పాటు

భోరజ్ మండలంలో వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇలా..

సర్వే నంబర్ మిస్సింగ్	26
పెండింగ్ మ్యూటేషన్	18
డిజిటల్ సైన్ పెండింగ్	31
ఎక్స్‌టెన్షన్ కరెక్షన్స్	106
ల్యాండ్ నేచర్ కరెక్షన్స్	10
పట్టాదారు డిటేల్స్ కరెక్షన్స్	110
నిషేధిత జాబితా నుంచి తొలగింపు	12
నిషేధిత భూమిలో చేర్చడం	08
అసైన్డ్ ల్యాండ్	59
ఓఆర్‌సీ నాట్ ఇష్యూడ్	05
38ఈ సర్టిఫికెట్ జారీ కానివి	01
సక్సేషన్	131
ల్యాండ్ ఎక్విషన్	01
ఇతర సమస్యలు	544



రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా (ఫైల్)

కైలాస్‌నగర్: ధరణిలో ఆప్షన్లు లేని కారణంగా పేరుకుపోయిన భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి చట్టం-2025ను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. చట్టం అమల్లో భాగంగా జిల్లాలో కొత్తగా ఏర్పడిన భోరజ్ మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. అక్కడి భూసమస్యలు తెలుసుకునేందుకు గాను ఈనెల 5నుంచి 16వరకు గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ముగ్గురు తహసీల్దార్ల ఆధ్వర్యంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రోజుకు మూడు గ్రామాల చొప్పున సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అయితే భారీగా దరఖాస్తులు అందాయి. జూన్ 2 నుంచి చట్టం పూర్తి స్థాయిలో అమలు కానున్న నేపథ్యంలో సమస్యల పరిష్కారంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. అందిన ప్రతీ దరఖాస్తు పరిష్కరించడమే లక్ష్యంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. సమస్యలు ఏ మేరకు పరిష్కరించి అన్నదాతకు భరోసా కల్పిస్తారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

1,067 దరఖాస్తులు ..

భోరజ్‌మండలంలో 28 రెవెన్యూ గ్రామాలున్నాయి. భోరజ్,భీంపూర్,బేల తహసీల్దార్ల ఆధ్వర్యంలో ఎనిమిది మంది రెవెన్యూ ఉద్యోగులతో కూడిన మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సదస్సులు నిర్వహించారు. అందులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఆయా భూసమస్యలకు సంబంధించి మొత్తం 1067 దరఖాస్తులు అందాయి. ఇందులో అత్యధికంగా సర్వేనంబర్లలో తప్పిదాలు,పట్టాదారు పాస్ పుస్తకంలో భూమి మిస్సింగ్, సరిహద్దుల వివాదం, పేర్ల మార్పిడి, డిజిటల్ సిగ్నిచర్ పెండింగ్, భూ విస్తీర్ణంలో తేడాలు, విరాసత్ వంటివి ఉన్నాయి. వీటన్నింటిని గ్రామం, రైతుల వారీగా కంప్యూటరీకరించిన రెవెన్యూ అధికారులు వాటిని పరిష్కరించే దిశగా చర్యలకు శ్రీకారం చుట్టారు.

ప్రారంభమైన క్షేత్రస్థాయి విచారణ

సదస్సుల్లో అందిన దరఖాస్తులను జూన్ 2లోగా పరిష్కరించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం భీంపూర్, భోరజ్, బేల, తలమడుగు, బజార్‌హత్నూర్, ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ల ఆధ్వర్యంలో ఆరు త్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నేతృత్వంలోని ఆర్‌ఐ, జూనియర్ అసిస్టెంట్, మండల సర్వేయర్‌లతో కూడిన ఈ బృందాలు తమకు కేటాయించిన గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాయి. మ్యాప్‌లు, పాత భూరికార్డులతో గ్రామాలకు వెళుతున్న అధికారులు తమకు అందిన దరఖాస్తులను ప్రత్యక్షంగా విచారిస్తున్నారు. అయితే ఇందులో ఏ మేరకు సమస్యలు పరిష్కారమవుతాయి అనేది త్వరలోనే తేలనుంది.

భూ సమస్యలన్నీ పరిష్కరిస్తాం



పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన భోరజ్ మండలంలో వివిధ భూ సమస్యలకు సంబంధించి 1067 దరఖాస్తులు అందాయి. వాటిని పరిష్కరించేందు కోసం సీనియర్ తహసీల్దార్లు , రెవెన్యూ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. వారు ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తులపై ప్రత్యక్షంగా విచారణ చేస్తున్నారు. వివరాలు సేకరించి జూన్ 2లోగా వాటన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– బి.వినోద్‌కుమార్, ఆర్డీవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ



కోటపల్లి: మండలంలోని రొయ్యపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. శనివారం ఉదయం కేంద్రం తలుపులు పగులకొట్టి ఉండటంతో స్థానికులు నిర్వాహకురాలు విజయలక్ష్మికి సమాచారం అందించారు. ఆమె అక్కడికి వచ్చి చూడగా కేంద్రంలో 17 పాల ప్యాకెట్లు, 10 పప్పు ప్యాకెట్లు, 5 ట్రేల కోడిగుడ్లను గుర్తుతెలియని దుండుగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలేజీరోడ్‌లో..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో ఈనెల 22న చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాలేజీరోడ్‌కు చెందిన ముక్తా ప్రసాద్ జైపూర్ మండలం ఇందారంలో రేషన్ షాపులో పనిచేసేవాడు. ప్రసాద్ ప్రతీ రోజు ఉదయం ఇందారం వెళ్లి సాయంత్రం వచ్చేవాడు. ఈనెల 21న ప్రసాద్ భార్య ఇంటికి తాళం వేసి బయటకు వెళ్తూ పక్కనే ఉన్న చందా ప్రసన్నలక్ష్మికి తాళం చెవి ఇచ్చింది. ఈనెల 22న ఉదయం ఇంట్లో బీరువాలో 120 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. సుమారు వీటి విలువ రూ.7.20 లక్షలు ఉంటుందన్నారు. ప్రసన్నలక్ష్మి, మరో వ్యక్తిపై అనుమానం ఉందని బాధితుడు ప్రసాద్ ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో



రాజన్న (ఫైల్)

జన్నారం: సైకిల్‌ను ఆటో ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందాడు. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై రాజవర్ధన్ కథనం ప్రకారం.. మండలంలోని అక్కపెల్లిగూడకు చెందిన గోలి రాజన్న (55) పాత ఇనుప సామాను దుకాణంలో పని చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. జన్నారం వైపు వస్తున్న ఆటో వెనుకవైపు నుంచి సైకిల్‌ను ఢీకొట్టడంతో రాజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని అతన్ని జన్నారంలో ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం లక్సెట్టిపేట ఆసుపత్రికి పంపించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన ఆటో బాదవత్ జనంత్‌రావుకు చెందినదిగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య కళావతి ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కూతురు ఉండగా పెళ్లయింది.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బెజ్జూర్: మండలంలోని కుశ్నపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పక్కా సమాచారంతో వాహనాలు తనిఖీ చేపట్టినట్లు పేర్కొన్నారు. సులుగుపల్లికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సిడాం సంతోష్ బైక్‌పై తరలిస్తున్న రూ.3,86,970 విలువ చేసే 3.47 కిలో గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సాహిత్యంలో ‘అరుణ’ కిరణం!

- ఆకట్టుకుంటున్న బట్టువార్ బాల సాహిత్యం..
- విద్యార్థుల్లో సాహిత్య బీజాలు నాటుతున్న ఉపాధ్యాయురాలు..
- తాను రచిస్తూ.. పిల్లల్లో సాహిత్యం పెంపొందించేలా ప్రేరణ..
- ఐదు భాషల్లో మధుర గేయాల పుస్తకాలు ముద్రణ
- సొంతంగా 1,937 కవితలు రాసిన టీచర్..
- నేడు ‘తెలంగాణ సారస్వత పరిషత్’ ఆధ్వర్యంలో సన్మానం



తెలుగులో గేయం రాసిన మన్నూర్ పాఠశాల విద్యార్థులు(ఫైల్)



ముద్రించిన బాలగేయాల పుస్తకాలతో అరుణ

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా భీంసరికి చెందిన ఉపాధ్యాయురాలు అరుణ బట్టువార్ ప్రాథమిక స్థాయి విద్యార్థులను బాల కవులు, సాహిత్యవేత్తలుగా తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న ఆమె.. బాలల్లో సాహిత్య ఆసక్తిని పెంపొందిస్తున్నారు. ఆమె స్వయంగా 1,937 కవితలు రాసి, 10 సాహిత్య పుస్తకాలను ప్రచురించారు. విద్యార్థుల ద్వారా ఐదు భాషల్లో ఆరు బాల గేయ పుస్తకాలను ముద్రించారు. ఆమె సేవలను గుర్తించి, ‘తెలంగాణ సారస్వత పరిషత్’ 82వ స్థాపన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం జరిగే బాల సాహిత్య సమ్మేళనంలో సన్మానించనుంది.

సాహిత్య సేవలకు గుర్తింపు

అరుణ బట్టువార్ 1997లో ఎంఏ, బీఎడ్ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. కథలు, నాటికలు రాసి రేడియో ప్రోగ్రామ్‌ల ద్వారా ప్రసారం చేశారు. ఆమెకు విశ్వవిఖ్యాత గౌతమి నంది, ఎస్వీఆర్ డిజిటల్ అండ్ గౌతమేశ్వర కామధేను, ప్రైడ్ ఇండియా, కలం భూషణ్, సాహితీ కిరణం, గుడిహత్నూర్ బెస్ట్ టీచర్, సావిత్రిబాయి పూలే, చతుర్ముఖ సింహ, కథరత్న, మధుర కవయిత్రి వంటి అనేక అవార్డులు లభించాయి. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, విశ్వవిఖ్యాత కీర్తి, తెలుగు వెలుగు జాతీయ సాహిత్య పురస్కారాలు, ఆర్‌ఎస్‌ఎన్ సేవ ఫౌండేషన్ కవితా పురస్కారాలు కూడా ఆమె సొంతం చేసుకున్నారు.

ఐదు భాషల్లో బాల గేయాలు

అరుణ బట్టువార్ పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులతో కవితలు, సాహిత్య రచనలు చేయించారు. 2021–24 మధ్య గుడిహత్నూర్ మండలం మన్నూర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ, విద్యార్థులతో తెలుగు, హిందీ, మరాఠీ, ఇంగ్లిష్ భాషల్లో గేయాలు రాయించారు. వాటిని ‘మన్నూర్ బాలల మధుర గేయాలు’, ‘మన్నూర్ చిల్డ్రన్స్ మెలోడీయస్ రైమ్స్’ వంటి పుస్తకాలను ముద్రించారు. 2013లో సీతారాంగూడ పాఠశాలలో గొండి భాషలో ‘చుదూర్ కాండీరా... చుదూర్ పాటింగ్’ గేయాల పుస్తకాన్ని రాయించారు. ఇంద్రవెల్లిలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులతో అలంకార కవితలు రాయించి పుస్తకం ముద్రించారు.

సాహిత్య బీజం నాటి..

అరుణ బట్టువార్ సాహిత్య ప్రతిభను విద్యార్థుల్లో నాటడం ద్వారా బాల సాహిత్యానికి కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ఆమె కృషిని జిల్లా వాసులు, తోటి ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు. ఆమె బోధన, సాహిత్య రచనలు భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి.

సంతోషించారు



గొండి భాషకు లిపి లేదు. మాతో గొండి భాషలో బాలగేయాలు రాయించాలని టీచర్ కృషి చేశారు. తెలుగులో చెబుతుంటే మేము గొండి భాషలో రాశాం. మా తప్పులు సరిచేస్తూ మళ్లీ రాయిస్తూ చక్కటి బాలగేయ పుస్తకాలను టీచర్‌తో కలిసి సమాజానికి అందించాం. మేం రాసిన పుస్తకం చదివి మా గ్రామస్తులు సంతోషించారు

– కినక గణేశ్, సీతారాంగూడ విద్యార్థి

బాల కవులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పిల్లల్లో సాహిత్యాన్ని పెంపొందిస్తాం. చక్కని కథలు, గేయాలు, వచన కవితలు రాసేటట్టు తర్ఫీదునిస్తాం. పిల్లలను బాల కవులుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యం. సాహితీ పుస్తకాలు చదవడం, రాయడంతో నైపుణ్యం పెరుగుతుంది.

– అరుణ బట్టువార్, ఇంద్రవెల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయురాలు

టీచర్ కృషితోనే..



తెలుగులో అలంకారాలు నేర్చుకోవడంలో టీచర్ సులువు పద్ధతి చెప్పేవారు. ఉదాహరణలు ఇస్తూ వాటి ద్వారా కవితలు రాయిస్తే గుర్తుంటాయని మాతో కవితలు రాయించేది. మొదట్లో కొంత తికమకపడ్డాం. మేడం సలహాలతో 20 మంది పదో తరగతి విద్యార్థులు వివిధ అలంకార కవితలు రాశాం. ఇలా రాయడంలో టీచర్ కృషి ఉంది.

– చంద్రకాంత్, మన్నూర్ పాఠశాల విద్యార్థి

పట్టు సాధించాం



టీచర్‌తోనే సాహిత్యం, బాలగేయం పరిచయమైంది. ఆమె ప్రోత్సాహంతో బాలగేయాలు రాసేవాళ్లం. అందులో తప్పులు సరిచేస్తూ మళ్లీ రాయించేది. ఇలా రాయడం ద్వారా సాహిత్యం, బాల గేయాలపై పట్టు సాధించగలిగాం. ఆంగ్ల బాలగేయ పుస్తకాన్ని ముద్రించగలిగాం. టీచర్ కృషితో ఇది సాధ్యమైంది.

– పెందోర్ లక్ష్మి, మన్నూర్ విద్యార్థిని

ఎస్టీపీపీలో వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించాలి



రియాజ్ అహ్మద్

జైపూర్: ఎస్టీపీపీలో వర్క్స్ కమిటీ సమావేశం నిర్వహించాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2016–20 వరకు స్టేగ్ కంపెనీ నుంచి కార్మికులకు ఫుల్‌అండ్ ఫైనల్ సెటిల్మెంట్ ఇప్పటివరకు చెల్లించలేదన్నారు. ఒక్కో కార్మికుడికి రూ.70వేలకు పైగా వస్తాయని, ఆ డబ్బులు సింగరేణి యాజమాన్యం కాజేసిందా అని ప్రశ్నించారు. పవర్‌మేక్ కంపెనీ సబ్ కాంట్రాక్టు వీవీఆర్ అనే కంపెనీ 2016–23 వరకు కార్మికులకు ఫుల్‌అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయలేదన్నారు. కంపెనీ నిబంధనలు ప్రకారం బోనస్ 8.33 ఇవ్వాలని అలా చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. పవర్‌మేక్ కంపెనీ వెంటనే డబ్బులు చెల్లించాలని లేకపోతే కార్మికులు ఆందోళన చేపడుతారని హెచ్చరించారు.

పులిని హతమార్చిన 30 మంది అరెస్టు

కాగజ్‌నగర్‌టౌన్: పెంచికల్‌పేట మండలంలోని ఎల్లూరు అటవీప్రాంతంలో విద్యుత్ తీగల ఉచ్చుతో పులిని హతమార్చిన 30 మందిని శనివారం అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ ఫారెస్టు డివిజన్ అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్ బోబాడే తెలిపారు. అప్పాజి శ్రీనివాస్, వెంకటేశ్,ఎల్కరి శేఖర్, రోహిని శ్రావణ్, చప్పిడె అశోక్, పవన్‌కుమార్,ఎల్కరి ప్రకాశ్, వెంకటేశ్, కాటెల సాగర్, నికాడి వెంకటేశ్, లా త్కరి శ్రీనివాస్, భీంకరి వెంకటేశ్, భీంకరి రంగయ్య, లేగల గోపాల్, రాచకొండ లచ్చయ్య, ఓంప్రె సంతోశ్, తుమ్మిడె శ్రీనివాస్, ఎల్కరి సుగుణాకర్, బుర్రి తిరుపతి, ఓంప్రె నారాయణ, లేగల వెంకటేశ్, గోమాసు రాజన్న, మడె మధునయ్య, లేగల సత్యనారాయణ, ఎల్లూరి లచ్చన్న, మౌల్కార్ దివాకర్, బిన్కర్ తిరుపతి, తుమిడె సత్తయ్య, పెద్దల నీలయ్య, గావుడె శంకర్ ఉన్నారన్నారు. సిర్పూర్(టి) సివిల్‌కోర్టులో హాజరుపర్చామని, 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా, ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

బాక్సింగ్ చాంపియన్లుగా నిలవాలి



బాక్సింగ్ పోటీల్లో గెలుపొందిన వారిని ప్రకటిస్తున్న నిర్వాహకులు



మాట్లాడుతున్న డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్

మంచిర్యాలటౌన్: బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు చాంపియన్లుగా నిలిచి, జాతీయస్థాయిలోనూ రాణించాలని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తిరాజ్‌వీర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ పర్యవేక్షణలో టైసన్ కప్–2025 చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలను శనివారం సాయంత్రం ప్రారంభించారు. ఈనెల 26వ తేదీ వరకు నిర్వహించనున్న బాక్సింగ్ పోటీలకు రాష్ట్రస్థాయి నుంచి 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పురుషోత్తం నాయక్, నిర్వాహకుడు చిలువేరు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నకిలీ పత్తి విత్తనాలు

కాగజ్‌నగర్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.60 లక్షల విలువైన 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఎస్డీపీవో డీవీ.శ్రీనివాస్‌రావు శనివారం వివరాలు వెల్లడించారు. నకిలీ విత్తనాలు సరఫరా అవుతున్నాయని టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో కాగజ్‌నగర్ సమీపంలోని పెద్దవాగు సమీపంలో తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అటుగా వచ్చిన ఏపీ39 టీవై 9741 నంబర్ ఐచర్ వ్యాన్‌ను తనిఖీ చేయగా అందులో 20 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు ఉన్నట్లు గుర్తించారు. విత్తనాలకు సంబంధించిన వివరాలు తెలుపకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన కొత్తపల్లి సదాశివ్, కర్నూల్ జిల్లా ఆదోనికి చెందిన డ్రైవర్ పుష్పాల లక్ష్మణ్, మహారాష్ట్రలోని అహేరికి చెందిన సంతోష్‌కిశోర్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మరో నిందితుడు వేణుగోపాల్‌రెడ్డి పరారీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, కాగజ్‌నగర్‌రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకటేశ్, రూరల్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్, ఇస్లాంనగర్ గ్రామాల్లో ఆదిలాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆధ్వర్యంలో శనివారం నకిలీ విత్తనాలు పట్టుకున్నట్లు తెలిసింది. ఉదయం 8 గంటలకు ఏకకాలంలో దాడులు నిర్వహించి నకిలీ బీజీ–3 విత్తనాలను పట్టుకున్నట్లు సమాచారం. ఈ దాడుల్లో 18 నకిలీ విత్తనాల బ్యాగులతో పాటు ముగ్గురిని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక ఎస్సై పురుషోత్తం వివరణ కోరగా ఆకస్మికంగా దాడులు జరిపిన మాట వాస్తవమన్నారు. విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.


నడుమునొప్పి భరించలేక ఆత్మహత్య



గరికే లక్ష్మణ్ మృతదేహం

తానూరు: నడుమునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై భానుప్రసాద్ కథనం ప్రకారం.. మండలంలోని వడ్‌ఝురి(బి) గ్రామానికి చెందిన గరికే లక్ష్మణ్ (29) రెండేళ్లుగా నడుమునొప్పితో బాధపడుతున్నాడు. గతేడాది శస్త్రచికిత్స చేయించుకున్నా నయం కాలేదు. ఆ తర్వాత వ్యవసాయ పనులు చేస్తుండగా కట్ల పాము కాటేసింది. కాళ్లవాపు తగ్గలేదు. వైద్య పరీక్షలు నిర్వహించుకోగా వ్యాధి నయం కాలేదు. అటు నడుమునొప్పి, ఇటు కాళ్లవాపు తగ్గకపోవడం తీవ్ర మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. రాత్రయినా లక్ష్మణ్ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి బాలాజీ వెతుకుంటూ వ్యవసాయ పొలానికి వెళ్లాడు. అక్కడ స్పృహ కోల్పోయిన లక్ష్మణ్‌ను భైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య నాగమణి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.


కార్మికులకు అండగా ఉండాలి



నియామక పత్రాలు అందజేస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉండాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి రసూల్‌పల్లెలోని తన నివాసంలో శ్రీరాంపూర్ డివిజన్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏ సమస్య వచ్చినా యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. కార్మికుల చిరకాల వాంఛ అయిన సొంతింటి పథకం అమలు కోసం కృషి చేస్తున్నామన్నారు. అలవెన్స్‌లపై ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్, రూ.25 లక్షల వడ్డీ లేని రుణం తదితర అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్నికల వేళ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులకు యూనియన్ పదవులు అప్పగించి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర కమిటీ నాయకులు భీంరావు గరిగే స్వామి, కలవేన శ్యామ్, ఏనుగు రవీందర్‌రెడ్డి, జీవన్‌జోయల్, తిరుపతిరాజు, నాయకులు పేరం రమేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు మధ్యప్రదేశ్‌వాసి మృతి



విష్ణుప్రసాద్ మృతదేహం

తాండూర్: పాముకాటుకు మధ్యప్రదేశ్ వాసి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వర్కడే విష్ణుప్రసాద్ (52) బతుకుదెరువు కోసం తాండూర్ మండలం రేపల్లెవాడకు వలసవచ్చాడు. ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులో కూలీ పనులు చేస్తూ రేపల్లెవాడలో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రించిన విష్ణుప్రసాద్ శనివారం తెల్లారేసరికి పాముకాటుకు గురై మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి సోదరుడు మాన్‌సింగ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పశువులు మృతి



లక్ష్మణచాంద: గేదె కళేబరం



దిలావర్‌పూర్:ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు కళేబరం



కడెం: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవు..

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లితండాలో విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందింది. గేదె ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం మేతకు వెళ్లి ంది. తిరిగి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో రైతు బానావత్ రాంజీ చుట్టుపక్కల వెతి కాడు. శనివారం అటు వైపుగా వెళ్లిన గ్రామస్తులకు గేదె మృతి చెంది కనిపించడంతో రైతుకు సమాచారమిచ్చారు. మేత మేసేక్రమంలో వి ద్యుత్ షాక్ తగలి మృతి చెందినట్లు గుర్తించా రు. దీని విలువ రూ.55 వేలు ఉంటుందని ప్ర భుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన రైతు నంద ముత్యం ఎద్దు శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఎప్పటిలాగే తన పంటచేలకు ఎడ్ల బండితో వెళ్లి అక్కడ వ్యవసాయ పనులు చేస్తున్నాడు. మేతకోసం ఎద్దులను పొలంలో ఉంచగా ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. అక్కడ 11 కేవీ విద్యుత్ తీగలకు ఎద్దు తోక తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు కిందపడిపోగానే అక్కడకు చేరుకున్న రైతు ఏం జరిగిందో తెలియక వేలాడుతున్న విద్యుత్ తీగను చూసి భయాందోళనకు గురయ్యాడు. వెంటనే విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలని అధికారులకు సమాచారమిచ్చారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

కడెంలో..

కడెం: మండలంలోని అల్లంపల్లి జీపీ పరిధి పాలరేగడి గ్రామ గిరిజన రైతు పెంద్రం మధుకు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. దత్తోజీపేట సమీపంలో శుక్రవారం ఆవు మేతకు వెళ్లి సాయంత్రం ఇంటికి వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలకు తగిలి షాక్‌తో మృతిచెందింది. దీని విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

కుళ్లిన చికెన్, పాడైన గుడ్లు



అన్నంలో వచ్చిన బొద్దింక



కుళ్లిన చికెన్

- దాబాలో నాసిరకం ఆహార పదార్థాలు
- తాజాగా అన్నంలో బొద్దింక ప్రత్యక్షం

బోథ్: సొనాల మండలంలోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో గల దాబాలో కుళ్లిన చికెన్, పాడైన గుడ్లు దర్శనమిచ్చాయి. అంతేకాదు దాబాలో తింటున్న ఓ యువకుడి అన్నంలో బొద్దింక వచ్చింది. బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామానికి చెందిన యువకుడు శనివారం సొనాల మండలం గుట్టపక్క తండా సమీపంలో ఓ పెట్రోల్ పంపు వద్ద ఉన్న దాబాకు వెళ్లాడు. భోజనం చేస్తుండగా అన్నంలో బొద్దింక ప్రత్యక్షంతో కంగుతిన్నాడు. వెంటనే దాబా సిబ్బందిని పిలిచి ఇదేంటని అడిగితే, అనుకోకుండా వచ్చిందని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. యువకుడు పలువురు స్థానికులు, విలేకరులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని తనిఖీ చేయగా బొద్దింక ఉన్న అన్నంతోపాటు, రిఫ్రిజిరేటర్‌లో కుళ్లిన చికెన్ మాంసంతోపాటు పాడైన ఉడకబెట్టిన గుడ్లు కనిపించాయి. అప్పటికే దాబాలో తింటున్న వారు అవాక్కయ్యారు. మధ్యలో భోజనం ఆపివేశారు. భోజనంలో బొద్దింక రావడంపై సదరు సిబ్బందిని అడుగగా నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని వారు తెలిపారు. అధికారులు వెంటనే దాబాను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

తాత్కాలికంగా సింగరేణి ప్యాసింజర్ రైలు రద్దు

బెల్లంపల్లి: భద్రాచలం రోడ్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య రాకపోకలు సాగించే సింగరేణి ప్యాసింజర్ రైలు (నెం.17033/17034)ను తాత్కాలికంగా రద్దు చేశారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో నాన్ ఇంటర్ లాకింగ్, రైల్వేట్రాక్ పునరుద్ధరణ పనులు జరుగుతుండటంతో రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈమార్గంలో ఎక్క డ నాన్ ఇంటర్ లాకింగ్, రైల్వేట్రాక్ పనులు చేపట్టినా సింగరేణి ప్యాసింజర్ రైలును తాత్కాలికంగా కొన్నిరోజుల పాటు రద్దు చేయడం రైల్వే అధికారులకు పరిపాటిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. ఈకారణంగా భద్రాద్రి కొత్తగూడెం వెళ్లడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డా యి. ముఖ్యంగా కోల్‌బెల్ట్‌ప్రాంతాల వాసులకు సింగరేణి పరంగా కొత్తగూడెం వెళ్తుంటారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సత్వరంగా సింగరేణి ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.